క్లుప్తంగా

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను కూటమి ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని, సమస్యలను పరిష్కరించాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు బుల్లిబాబు, మోహన్‌బాబు, వెంకటరమణ, వేణు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఒప్పంద అధ్యాపకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ 24సంవత్సరాలుగా పనిచేస్తున్న తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

భక్తుల అయ్యప్ప మాలధారణ



అయ్యప్ప మాల ధరించిన భక్తులు

అరకులోయటౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో బుధవారం 30 మంది భక్తులు అయ్యప్ప మాలధారణ చేశారు. ఆశ్వీజయ చతుర్ధశి పురస్కరించుకొని స్థానిక శివాలయంలో భక్తులు అయ్యప్ప స్వామి మాల ధరించారు. గురుస్వామి శ్రీను భక్తులకు మాల ధారణ చేశారు. ఈ సందర్భంగా శివాలయంలో అయ్యప్ప నామస్మరణతో పూజలు చేశారు. అయ్యప్ప మాలధారులు సుమారు 42 రోజుల పాటు కఠోర దీక్షతో మాలధారణ చేపట్టనున్నట్టు గురుస్వామి శ్రీను తెలిపారు.

48 మందికి వైద్య పరీక్షలు



దాకరాయిలో గ్రామస్తులకు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని మర్రిపాలెం, దాకరాయి గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సరోజ్‌కుమార్ మాట్లాడుతూ శిబిరాల్లో సుమారు 48 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు తెలిపారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. ఏఎన్ఎం సూర్య, హెచ్‌వీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నానిబాబు, 104 డీఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సత్కారం



ఎంపీడీవో శ్రీసాయి హర్షను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీసాయి హర్షను బుధవారం వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు కలిసి, అభినందనలు తెలియజేశారు. వారికి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, సర్పంచులు బాబూరావు, గంగాధర్, నీలకంఠం, ఎంపీటీసీ సభ్యులు కమల, నబ్బో, నాయకులు మూర్తి, అర్జున్, తిరుపతి, బాలరాజు, దాసు, మోహన్, జోగారావు తదితరులున్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

- ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



గూడెంకొత్తవీధి: శ్లాబ్ స్థాయికి చేరిన ఇళ్లను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు కోరారు. ఈవోఆర్‌డీ పాపారావుతో కలిసి సంక్షేమ సహాయకులు, ఇంజినీరింగ్ సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్నవాటిని వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా మంజూరైన గృహాలకు త్వరలో గ్రౌండింగ్ మేళాను నిర్వహిస్తారని తెలిపారు. నీటి ట్యాంకులను ప్రతీ 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. డిజిటల్ సహాయకులు ఈ-సర్వీసులపై దృష్టి సారించాలని సూచించారు. సంక్షేమ సహాయకులు విధిగా పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099
సాక్షి

వెతలు తీరేనా?



దొరగూడలో ఊటనీటిని సేకరిస్తున్న గ్రామస్తులు

- గ్రామాల్లో తాగునీటి ఎద్దడి
- కలుషిత నీరే శరణ్యం
- అధ్వాన దారులతో అవస్థలు
- సమస్యలతో గిరిజనుల సహవాసం
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: మన్యంలోని గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. గ్రామాల్లో తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏజెన్సీలో శరవేగంగా అభివృద్ధి పనులు జరిగాయి. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం కోట్లాది రూపాయలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. ఎన్నికలు రావడంతో పనులన్నీ నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా నేటి వరకు మన్యంలో ఒక్క పని చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను పూర్తి చేయడం లేదు. ఫలితంగా ప్రతి గ్రామంలో సమస్యలు వెంటాడుతున్నాయి. గిరిజనులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు.

కలుషిత నీటితో ప్రబలుతున్న రోగాలు

మండలంలో గల మారుమూల భూసిపుట్టు పంచాయతీ దొరగూడ గ్రామంలో తాగునీటి సమస్యతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. నీటి కోసం కాలినడకన సుదూర ప్రాంతం వెళ్లి ఊటనీరును తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు కోరినా కనీస స్పందన లేదని గ్రామస్తులు బిస్సు, భాగ్యవతి, డొమ్మి, కొములు, గణపతి, ధనుర్జుయ్, భాస్కర్‌రావు తదితరులు చెబుతున్నారు. ఊటనీరును తాగడం వల్ల అనారోగ్యానికి గురువుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వరదనీటితో ఊటనీరు సైతం కలుషితమై బురద నీరుగా మరిపోతుందంటున్నారు. దీంతో నీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రేషన్ కోసం అష్టకష్టాలు

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల పంచాయతీ చుట్టుమెట్ట గ్రామంలో పలు సమస్యలతో గిరిజన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే రహదారి పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా ఉంది. గ్రామంలోని ప్రజల తాగునీటి ఇక్కట్లు పడుతున్నారు. రేషన్ కోసం మొబైల్ సిగ్నల్స్ లేక మిషన్ పనిచేయక నానా అవస్థలు పడుతున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామం నుంచి సుదూర ప్రాంతంలో సిగ్నెల్స్ అందుతున్న చోటు రేషన్ పంపిణీ జరుగుతుంది. దీంతో కాలినడకన అక్కడికి వెళ్లి రేషన్ సరకులు పొందాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ల కోసం ఇదే సమస్య వెంటాడుతోందని చెబుతున్నారు. గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు పిడుగుపడి బావి కూలిపోయిందని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు వేడుకుంటున్నారు.



చట్టుమెట్టలో సెల్ సిగ్నల్స్ పనిచేయక వేరే ప్రాంతంలో రేషన్ అందజేస్తున్న దృశ్యం



వలసపల్లి-మునసపల్లి రోడ్డు దుస్థితి

చిత్తడి దారితో ఇక్కట్లు

సీలేరు: దుప్పులవాడ పంచాయతీ పరిధిలో వలసపల్లి, మునసపల్లి గ్రామాలకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఆ గ్రామాలకు రహదారి సౌకర్యం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర సరకులు కోసం , అత్యవసర సమయాల్లో వైద్య సేవల నిమిత్తం ఆ గ్రామస్తులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న మట్టిరోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టిరోడ్డు పూర్తిగా ధ్వంసమై, భారీ వృక్షాలు కొట్టుకు రావడంతో రహదారి బురదమయంగా మారింది. వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వరదలు వచ్చి నెలరోజులైనా గ్రామానికి అధికారులు ఎవరూ రాలేదని, తమను పట్టించుకునే నాథుడు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వలసపల్లి గ్రామానికి పక్కా రోడ్డు నిర్మించాలని, రోడ్డుపై ఉన్న చెట్లను ,రాళ్లను తొలగించి కోతకు గురైన కాలిబాటను మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి , సర్పంచ్ వెంకటేశ్వర్లు దొర తదితరులు

గంగవరం : మండలంలోని ఎంపీపీ పాఠశాలల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు. మర్రిపాలెం పంచాయతీ పరిధిలోని ఎల్లాపురం గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ పాఠశాల భవనం అధ్వానంగా ఉన్నట్టు గ్రామస్తులు తన దృష్టికి తీసుకురాగా పాఠశాలను సందర్శించినట్టు ఆయన చెప్పారు. పాఠశాల భవనం దుస్థితిని విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. మోనూ అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో పలు సమస్యలను స్థానికులు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ కృష్ణారెడ్డి, మర్రిపాలెం సర్పంచ్ మడకం వెంకటేశ్వర్లుదొర గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం



బాధితులను పరామర్శిస్తున్న బాలదేవ్ తదితరులు

అరకులోయ రూరల్: మండలంలో మాడగడ గ్రామానికి చెందిన 12 మంది గిరిజనులు తాగునీరు కలుషితమై అస్వస్థతకు గురై ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ తదితరులు బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులంటే కూటమి ప్రభుత్వానికి చులకన, బాధితల విషయంపై యంత్రాంగం, అధికారులు కనీసం స్పందించలేదన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామంలో పారిశుధ్యం కొరవడిందన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కిందిస్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తూ గిరిజనుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి బుజ్జిబాబు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్

అడ్డతీగల: స్థానిక సీహెచ్‌సీలో బుధవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.సతీష్ మాట్లాడుతూ వయస్సులో పెద్దలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పెద్దల పట్ల నేటి తరం చూపిస్తున్న వ్యవహారశైలిని పరిగణలోనికి తీసుకోవాలని, సుగర్, బీపీ నియంత్రణ చేసుకోవాలన్నారు. సమయానికి మందులు వేసుకోవడంతో పాటు సమతుల్యమైన ఆహారం , వ్యాయామం చేయడం మంచి ఆలోచనలతో గడపడం చేయాలని సూచించారు. సీహెచ్‌సీ కౌన్సిలర్ ఎస్.వాసు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు.కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహారం తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వైద్యులు రచన, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి, అధికారులు

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలోని కన్నయమ్మపేటకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పంచాయతీరాజ్ ఇంజినీర్లు, సీడీపీవో, ఎంపీడీవో తదతర అధికారులతో కలిసి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం పూర్తయి ఏడేళ్లు కావస్తున్నా నేటికీ వినియోగంలో రాలేదని, శిథిలదశకు చేరిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, భవనం తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో భవనాన్ని పీఆర్ ఏఈఈ రవితేజ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావుతో కలిసి పరిశీలించినట్టు చెప్పారు. భవనం శ్లాబ్ లీకవుతుందని, ఫ్లోరింగ్ పాడైందన్నారు. భవనం పరిస్థితి నివేదికను కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందజేస్తామని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు చెప్పారు. అంగన్‌వాడీ భవనాన్ని ఇకనైనా ఉపయోగంలోకి తీసుకురావాలని ఎంపీపీ వెంకటలక్ష్మి అధికారులను కోరారు.

ఆత్మీయ వీడ్కోలు



సత్యనారాయణను సన్మానిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి, జడ్డంగి పోస్టాఫీసుల్లో పోస్టర్ రన్నర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఈమని సత్యనారాయణను సహచర ఉద్యోగులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోస్టుమాస్టర్ ఎం.అజయ్ మాట్లాడుతూ సత్యనారాయణ సుమారు నాలుగున్నర దశాబ్దాలుగా పోస్టల్‌శాఖకు ఉత్తమ సేవలందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన సత్యనారాయణకు పోస్టల్ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా మంజూరైన రూ.70వేల చెక్కును అందజేశారు. బీపీఎంలు సీతారామరాజు, రామస్వామి, రమణ, తాతయ్య, ఆనంద్ అప్పారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం



జి.మాడుగులలో ఉపాధ్యాయులకు ఫారాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

జి.మాడుగుల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు కైలాసం, నీరంజన్ కోరారు. ఈ మేరకు వారు స్థానిక ప్రభుత్వ కళాశాల, పాఠశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను వారు బుధవారం కలిసి ఓటరు నమోదు ఫారాలను అందజేశారు. హెచ్‌ఎం బాలరాజు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని పెదగరువు పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సత్యారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎం కొండమ్మ, ఉపాధ్యాయులు ప్రభాకరరావు తదితరులున్నారు.

డస్ట్‌బిన్‌ల పంపిణీ



డస్ట్ బిన్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మాధవరావు తదితరులు

పెదబయలు: మండలంలోని సీతగుంట గ్రామ పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ మాధవరావు ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులకు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు కిమంకరి బొంజుబాబు తదితరులు డస్ట్‌బిన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఇంటికి అందజేసిన డస్ట్‌బిన్‌లలో తడి, పొడి చెత్తను వేసి, పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఉప సర్పంచ్ గంగాధరం, వార్డు సభ్యుడు జీవన్‌కుమార్, వర్తకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక బోధన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో,విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొయ్యూరు: మండల కేంద్రంలో డిసిలెక్సియపై ఎంఈవో ఎల్.రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాంబాబు మాట్లాడుతూ దివ్యాంగులకు అభ్యాసన లోపాలు సరిదిద్దేందుకు వీలుగా ప్రత్యేక బోధన చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగ విద్యార్థుల లోపాలను తగిన శిక్షణద్వారా సరిదిద్దవచ్చన్నారు. దివ్యాంగులను అందరితో సమానంగా చూడాలని కోరారు.వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి బయటకు తీసుకురావాలన్నారు. ప్రత్యేక ఎడ్యుకేటర్లు చందు, రాజు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటిరియల్‌ను అందజేస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం పడాల్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

జి.మాడుగుల: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థులకు ఆయా స్టడీ మెటీరియల్‌ను ఇన్‌చార్జి హెచ్‌ఎం పడాల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమ కోసం ఏకలవ్య ఫౌండేషన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, ఆదినారాయణ, సింహాచలం, నాగరత్నం, పీడీ రాజులమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ



కొయ్యూరు ఎంపీడీవో రమేష్ నాయుడు



రాజవొమ్మంగి తహసీల్దార్ సూర్యారావు

కొయ్యూరు: కొయ్యూరు ఎంపీడీవోగా బి.రమేష్ నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సబ్బవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడి ఎంపీడీవో మేరీరోజ్‌ను అనకాపల్లి జిల్లా గొలుగొండకు బదిలీ చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎంపీడీవో రమేష్‌నాయుడు మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బదిలీపై గొలుగొండ వెళ్తున్న ఎంపీడీవో మేరీరోజ్ అతనికి శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్‌గా సూర్యారావు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి తహసీల్దార్‌గా కె.సూర్యారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమలాపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కరక సత్యనారాయణ దేవీపట్నం తహసీల్దార్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే.

గ్రామంలో పాఠశాల కోసం వినతి



ఎంఈవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఎటపాక: మా పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని గ్రామంలో వెంటనే బడి ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని సాలిబుడప గిరిజనులు ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు బుదవారం ఎటపాక వెళ్లి తమ గోడును అధికారులకు తెలియజేశారు.

గ్రామంలో 30 సంవత్సరాలుగా గ్రామంలో నివాసం ఉంటున్నామని నాటి నుంచి బడి, అంగన్‌వాడీ కేంద్రం లేక పిల్లలు పశువుల కాపరులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలని చదివించుకుంటామని వెంటనే గ్రామంలో బడి ఏర్పాటు చేయాలని వేడుకున్నారు. అధికారులను కలిసిన వారిలో పార్టీ మండల కార్యదర్శి ఐవి,గ్రామస్తులున్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



దేవరపల్లిలో పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్ రమేష్



సుజనపేటలో పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి తదితరులు

అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ దేవరపల్లి, దుంగియాపుట్టు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రోడ్డు పనులకు సర్పంచ్ పాడి రమేష్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్నలు బుధవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలన్నారు. వీఆర్‌పిలు మోసే, లోలిత్ ,టిఏ గోవర్ధన్, ఇంజినీర్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోటలో ఉపాధి హమీ పథకం ద్వారా మంజూరైన కందకాల తవ్వకం, ట్రెంచ్ పనులను ఎంపీడీవో శ్రీసాయి హర్ష, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఉపాధి పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

చింతపల్లి: మండలంలోని భీముడుచట్రు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన ఫారం పాండ్ పనులను కిటుముల సర్పంచ్ రమణమ్మ బుధవారం ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుర్ల లోవరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కిటుములలో ఫారంపాండ్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణమ్మ



చినార్యూరులో ఫారంపాండ్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రంగమ్మ , సర్పంచ్ అభిరాం

కూనవరం: మండలంలోని కొండ్రాపేట, చినార్యూరు, చూచిరేవులగూడెం పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన ఫారం పాండ్, చెరువు పనులకు ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్‌లు సున్న అభిరాం, కట్టం లక్ష్మి, తెల్లం నిరోషా బుధవారం భూమిపూజ చేశారు. ఏపీవో శ్రీకాంత్, కార్యదర్శి శివమణి కంఠ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో సతమతం

దుంబ్రిగుడ: మన్యంలో జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా పలుచోట్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. డుంబ్రిగుడ మండల కేంద్రంలో బుధవారం, శుక్రవారాల్లో వారపు సంతలకు వెళ్లే వాహనాలు ఈ సమస్య మరింతగా ఉంటుంది. హైవే రోడ్డుకు ఇరువైపులా ఆటోలను ఇష్టానుసారంగా నిలుపుదల చేస్తుండడంతో పాటు రోడ్డును ఆక్రమంచి దుకాణాలు సామాగ్రి ఏర్పాటు చేయడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. పాదచారులు నడిచే అవకాశం లేకుండా ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. ఎదురెదుగా బస్సులు వచ్చే పరిస్థితి లేదని స్థానికులు చెబుతున్నారు. తరచూ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పనుల్లో అధికారుల పర్యవేక్షణ అవసరం



ఎంపీపీ బాకా ఈశ్వరి

దుంబ్రిగుడ: మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లో జరిగే వివిధ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని డుంబ్రిగుడ ఎంపీపీ బాకా ఈశ్వరి అన్నారు.

ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో గతంలో గుర్తించి పనులతో పాటు వివిధ పంచాయతీల్లో జరుగుతున్న పనుల్లో ఆలసత్వం చేయవద్దన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించి, సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్డు తదితర మౌలిక సదుపాయాల పనులను ప్రభుత్వం కల్పించాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులు జరుగుతున్నాయన్నా రు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లేని పక్షంలో ఉన్నదాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.